

డివైడర్‌ను ఢీకొట్టిన వాటర్ ట్యాంకర్, ఊడిపోయిన వెనుక చక్రాలు

బ్రేకులు ఫెయిల్.. డివైడర్‌ను ఢీకొట్టిన వాటర్ ట్యాంకర్

కవాడిగూడ, సెప్టెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): బ్రేకులు ఫెయిలై ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ డివైడర్‌ను ఢీకొట్టింది. దోమలగూడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లోయర్‌ట్యాంక్‌బండ్‌లోగల ప్రైవేట్ ట్యాంకర్ యజమాని ప్రతిరోజూ గాంధీనగర్‌లో ఓ ఆస్పత్రికి నీటిని సరఫరా చేస్తుంటాడు. ఆదివారం నీటిని తీసుకెళ్తుండగా బ్రేకులు ఫెయిలవడంతో లోయర్ ట్యాంక్‌బండ్‌లో డివైడర్‌ను ఢీకొట్టింది. వెనుక చక్రాలు ఊడిపోయాయి. ఆ సమయంలో ఎవరూ అక్కడ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ ఘటనతో కొద్దిసేపు ట్రాఫిక్ జామ్ అయింది. సమాచారం అందుకున్న చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ట్యాంకర్‌ను అక్కడి నుంచి తరలించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలను పరిష్కరించే వారికి గుర్తింపు : ఎమ్మెల్యే

ముషీరాబాద్, సెప్టెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): ఎన్‌జీవో సంస్థలో పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేసేవారికి సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. ఆదివారం భోలక్‌పూర్‌కు చెందిన బస్తీ వికాస్ మంచ్ (ఎన్‌జీవో) సంస్థ ప్రతినిధి ఎండీ మున్వర్‌చాంద్ వివిధ అంశాలపై అధ్యయనం చేసేందుకు లండన్ వెళ్తుండడంతో బీఆర్‌ఎస్ నాయకులు ఖదీర్, సయ్యద్ భకియార్ ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భోలక్‌పూర్‌లో కలుషిత నీటి నివారణ, ప్రభుత్వ పాఠశాలలో వర్షం నీటిని ఒడిసి పట్టి సద్వినియోగం చేసుకునేలా మున్వర్‌చాంద్ ఎన్‌జీవో సంస్థ ద్వారా కృషిచేశారన్నారు. వ్యర్థాలతో వంట గ్యాస్ ఉత్పత్తి చేసే విధంగా స్కూల్స్‌లో ప్రత్యేక యంత్రాన్ని ఏర్పాటు చేశారని ప్రశంసించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మర్కజీ అంజుమన్ మహిదీవియా

సంయుక్త కార్యదర్శిగా సయ్యద్ పర్వేజ్



ముషీరాబాద్, సెప్టెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ మైనార్టీ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ పర్వేజ్ మర్కజీ అంజుమన్ మహిదీవియా (ఎంఏఎం) సంయుక్త కార్యదర్శిగా నియమితులయ్యారు. ఆదివారం ఆయనకు ఎంఏఎం అధ్యక్షుడు మున్వర్‌ఖాన్, ఖలీఫ్ నియామకపత్రాన్ని అందజేశారు. పర్వేజ్ మాట్లాడుతూ.. ముస్లింల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

పంచాయతీరాజ్, మున్సిపల్ ఎన్నికల్లో

బీసీ రిజర్వేషన్లు 42 శాతం అమలు చేయాలి : ఆర్. కృష్ణయ్య

రాంనగర్, సెప్టెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్, మున్సిపల్ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు 42 శాతం అమలు చేయాలని కోరుతూ ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీకి రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆదివారం లేఖ రాశారు. ఇందుకు సంబంధించిన వివరాలను విద్యానగర్‌లోని బీసీభవన్‌లో ఆయన ఆదివారం విలేకరులకు తెలియజేశారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు 50 శాతం సీలింగ్ సాకుగా చూపించి బీసీ రిజర్వేషన్ తగ్గించడానికి రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని, దీనిపై రాహుల్‌గాంధీ చర్యలు తీసుకోవాలన్నారు. బీసీ కులగణన కూడా అమలుజరిగేలా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. తమ డిమాండ్లపై ఈ నెల 20న బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమం చేపడుతున్నట్లు ఆర్.కృష్ణయ్య తెలిపారు.

వర్గీకరణపై సుప్రీం తీర్పును పునఃపరిశీలించాలంటూ

11న ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద బహిరంగ సభ

నల్లకుంట, సెప్టెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పునఃపరిశీలించాలని కోరుతూ ఈనెల 11న ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కన్వీనర్ డి.సర్వయ్య, కో-కన్వీనర్ చెరుకు రాంచందర్ తెలిపారు. హైదర్‌గూడలో ఆదివారం వారు మాట్లాడారు. సభకు ముఖ్యఅతిథులుగా ఉత్తరప్రదేశ్ మాజీ సీఎంలు మాయావతి, అఖిలేష్ యాదవ్, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్, ఎంపీ చంద్రశేఖర్ ఆజాద్, ఇతర జాతీయ నాయకులు హాజరవుతారని పేర్కొన్నారు. దీనికి మద్దతుగా రాష్ట్రంలోని 33 జిల్లాల్లోని అంబేడ్కర్ విగ్రహం నుంచి కలెక్టరేట్‌ల వరకు, హైదరాబాద్‌లో లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం నుంచి ఇందిరాపార్కు ధర్నా చౌక్ వరకు ర్యాలీలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

'వర్గీకరణపై సుప్రీం తీర్పు ఆర్టికల్ 341కు వ్యతిరేకం'

నల్లకుంట, సెప్టెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆర్టికల్ 341కు వ్యతిరేకం అని, ఇది రాజ్యాంగ విరుద్ధమని జై భీమ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు పి. బల్వంత్‌రావు అన్నారు. వర్గీకరణకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టులో ఇప్పటి వరకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి సుమారు వందకు పైగా రివ్యూపిటిషన్లు వేశారన్నారు. ఆదివారం హైదర్‌గూడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు బీఎస్పీతో పాటు దేశంలోని దళిత ఎంపీలందరూ వ్యతిరేకమన్నారు. వర్గీకరణకు వ్యతిరేకంగా దేశ రాజధాని ఢిల్లీలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై ఎమ్మార్పీఎస్ నేతలు వాస్తవాలు తెలియకుండా మాలలపై అసత్య ప్రచారం చేయడం తగదన్నారు.

'లోతట్టు ప్రాంత వాసులు అప్రమత్తంగా ఉండాలి'

అంబర్‌పేట, సెప్టెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): మూసీ పరీవాహకంలో నివసించే లోతట్టు ప్రాంత వాసులు అప్రమత్తంగా ఉండాలని అంబర్‌పేట తహసీల్దార్ వీరాబాయి సూచించారు. వర్షాల నేపథ్యంలో హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ గేట్లు ఎత్తివేసే అవకాశం ఉన్నందున అంబర్‌పేట మండల పరిధిలోని శంకర్‌నగర్ లోతట్టు ప్రాంతంలో నివసించేవారు అప్రమత్తంగా ఉండాలన్నారు. మండల సిబ్బంది ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తున్నారన్నారు.

'పార్లమెంట్‌లో గోసంరక్షణ బిల్లు ప్రవేశపెట్టాలి'

బర్కత్‌పుర, సెప్టెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో గో సంరక్షణ బిల్లు ప్రవేశపెట్టాలని రాష్ట్ర గోశాలల ఫెడరేషన్ గౌరవాధ్యక్షుడు మహేష్ అగర్వాల్ పిలుపునిచ్చారు. ఆదివారం కాచిగూడలోని గోశాల ఫెడరేషన్ కార్యాలయంలో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సమర్పణ్, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరబాద్ జూబ్లీహిల్స్ సంయుక్తాధ్వర్యంలో గోశాలలకు ఉచితంగా పశువుల దాణాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గో సంతతి తగ్గిపోవడం వల్ల వ్యవసాయం, పాడిపరిశ్రమపై తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నారు. గో హత్యలను నిషేధించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ అధ్యక్షురాలు నిర్మలా సంఘీ, మాజీ గవర్నర్ బద్రి విశాల్, కార్యదర్శి నందిని అగర్వాల్ తదితరులు పాలొగన్నారు.

కరాటే పోటీల విజేతలకు బెల్ట్‌లు, సర్టిఫికెట్‌లు

బర్కత్‌పుర, సెప్టెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక సాహిత్య మందిర్‌లో ఆదివారం కరాటే పోటీలు నిర్వహించారు. దాదాపు 80 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఉత్తీర్ణులైన వారికి బెల్ట్‌లు, సర్టిఫికెట్‌లు అందజేశారు. కార్యక్రమంలో జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా తెలంగాణ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ రాపోలు సుదర్శన్, కరాటే మాస్టర్లు విశ్వనాథం, అంతటి సోములు, పవన్‌కల్యాణ్, రవిందర్, కృష్ణ, దామోదర్‌నాయక్, ప్రశాంత్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గౌడ అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్

అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

రాంనగర్, సెప్టెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): గౌడ అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ బండి సాయన్నగౌడ్, ప్రధాన కార్యదర్శిగా జీవీ శ్రీనివాస్‌గౌడ్, కోశాధికారిగా ముగిలి రఘునాథ్‌గౌడ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ.. అసోసియేషన్ సభ్యుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోర్ కమిటీ సభ్యులు డాక్టర్ శేషగిరిరావు, వెంకటరాజం, బి. విజయకుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

లంబోదరుడికి

భక్తిశ్రద్ధలతో పూజలు

ముషీరాబాద్/అంబర్‌పేట జోన్ బృందం (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. లంబోదరుడికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మండపాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల వద్ద ఎంపీలు, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, పలు పార్టీల నాయకులు, పోలీసు అధికారులు, మండపాల నిర్వాహకులు తదితరులు పూజలు నిర్వహించారు.



ఆశోక్‌నగర్‌లో వినాయకమండపంలో పూజలు నిర్వహించిన ఎంపీ డా. లక్ష్మణ్





తిలక్‌నగర్, విద్యానగర్‌లో గణేశ్ మండపాల వద్ద అన్నదాన క్యాక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్



అంబర్‌పేట బురుజుగల్లీలో శ్రీహనుమాన్ దేవాలయంలో ఏర్పాటు చేసిన గణనాథుడి పూజలో మాజీ ఎంపీ వి. హనుమంతరావు తదితరులు



గోల్నాక ఖాద్రీబాగ్ కిషోర్‌కుంజ్ స్కూల్ లేన్‌లో ఏర్పాటు చేసిన గణేశ్ మండపంలో పూజలు నిర్వహించిన కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్



ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని లక్ష్మీగణపతి ఆలయంలో పల్లకీ సేవలో కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్



కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో పూజలు నిర్వహిస్తున్న తూర్పు మండలం అడిషనల్ డీసీపీ నర్సయ్య, ఏసీపీ వి. రఘు, సీఐ కె. చంద్రకుమార్ తదితరులు



ముషీరాబాద్‌లో గణపతి పూజలో మాజీ కార్పొరేటర్ వి. శ్రీనివాస్‌రెడ్డి, సిరిగిరి శ్యామ్, సంగిశెట్టి రాజు తదితరులు



ముషీరాబాద్‌లో గణనాథుడికి పూజలు చేసిన శక్తియూత్ అసోసియేషన్ అధ్యక్షుడు, కాంగ్రెస్ గ్రేటర్ ఉపాధ్యక్షుడు జెనిగె శ్రీనివాస్ యాదవ్ తదితరులు



కవాడిగూడ సింగాడికుంటలో ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి పూజలు నిర్వహించిన నిర్వాహకులు



బండమైసమ్మనగర్‌లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద పూజలు నిర్వహించిన నిర్వాహకులు

మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇళ్లను తొలగించొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం పార్టీ నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్

గోల్నాక, సెప్టెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇళ్లను తొలగించొద్దని సీపీఎం పార్టీ నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం గోల్నాకలోని ఫేరెల్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో సీపీఎం అంబర్‌పేట నియోజకవర్గం ఆధ్వర్యంలో నగర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.మహేందర్ అధ్యక్షతన మూసీ పరీవాహక ప్రాంత బాధితుల సమావేశంలో జరిగింది.

ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీనివాస్ మాట్లాడుతూ.. రూపాయి రూపాయి దాచుకొని స్థలాలు కొనుక్కొని పేదలు ఇళ్లు కట్టుకుంటే వాటిని కూల్చాలని నిర్ణయించడం తగదన్నారు. ఈ చర్యను సీపీఎం ఖండిస్తుందన్నారు. వారికి ప్రత్యామ్నాయం చూపకుండా ఇళ్లు కూలిస్తే న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు.

తులసీరాంనగర్ (లంక) మూసీ పరీవాహక ప్రాంత బస్తీ వాసులు మహేష్, దుర్గా, ఉమాదేవి, నరసింహ, కృష్ణ, సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ.. ఇళ్లు నిర్మించుకొని 70 ఏళ్ల నుంచి నివసిస్తున్నామని, ప్రభుత్వానికి పన్నులు చెల్లిస్తున్నామని, తమ ఇళ్లను కూల్చడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో సీపీఎం అంబర్‌పేట జోన్ కమిటీ నాయకులు జి.రాములు, బి.సుబ్బారావు, షబానా, వరలక్ష్మి, అఖిల్, రయీస్ తదితరులు పాల్గొన్నారు.

'కల్యాణలక్ష్మి'లో కమీషన్ల దందా!

- రూ.10 వేలు తీసుకుని అనర్హులకు చోటు
- ప్రభుత్వ ఉపాధ్యాయురాలి కుమార్తెకు ఆర్థికసాయం
- ఎమ్మెల్యే చేతులమీదుగా అందుకున్న ఉపాధ్యాయురాలి భర్త

సరూర్‌నగర్, సెప్టెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): పేదలకు దక్కాల్సిన కొన్ని సంక్షేమ పథకాలు దళారుల కమీషన్ల దందాతో పక్కదారి పడుతున్నాయి. ఇందులో కల్యాణలక్ష్మి పథకం ఒకటి. ఈ పథకం కింద పేద కుటుంబాల్లో ఆడపిల్లల పెళ్లికి లక్షా నూట పదహారు రూపాయల ఆర్థిక సాయం అందిస్తారు. అయితే కొందరు నేతలు పదివేల దాకా కమీషన్ తీసుకుని అనర్హులకు ఆర్థిక సాయం మంజూరు చేయిస్తున్నట్లు తెలుస్తోంది. మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేట్ కార్పొరేషన్‌లో తాజాగా ఓ ప్రభుత్వ ఉద్యోగి కుమార్తెకు కల్యాణలక్ష్మి ఆర్థిక సాయం మంజూరు కావడం చర్చనీయాంశంగా మారింది. నగర శివారులోని ఓ గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేసే మీర్‌పేట్ నంది హిల్స్ కాలనీకి చెందిన మిద్దెల భాగ్యలత కుమార్తె మేఘన వివాహం గత ఏడాది నవంబర్‌లో జరిగింది. భాగ్యలత ప్రభుత్వ ఉద్యోగి (టీచర్). ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆమె ఓటు హక్కు(ఐడీ నంబర్: వైయూవో 3269198) వినియోగించుకున్నట్లు ఓటరు జాబితాను బట్టి స్పష్టమవుతోంది. నిబంధనల ప్రకారం వీరికి కల్యాణలక్ష్మి పథకం వర్తించదు. కానీ కొందరు స్థానిక బీఆర్‌ఎస్ నేతలు పైరవీ చేసి వారికి ఆర్థిక సాయం మంజూరు చేయించారు. ఇందుకు రూ. 10 వేలు కమీషన్ తీసుకున్నట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది.

'ఆమె'కు బదులు 'ఆయన'

సాధారణంగా కల్యాణలక్ష్మి పథకం చెక్కులు పెళ్లికుమార్తె తల్లి పేరు మీద మంజూరవుతాయి. తల్లే తీసుకోవాల్సి ఉంటుంది. మేఘనకు ఆమె తల్లి భాగ్యలత పేరు మీద చెక్కు రాగా.. తండ్రి బర్ల మధుసూదన్ (భాగ్యలత భర్త) మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి చేతుల మీదుగా అందుకోవడం గమనార్హం! గతంలో ఆమె తన బదిలీ కోసం అప్పుడు మంత్రిగా ఉన్న సబితా ఇంద్రారెడ్డి వద్దకు పలుమార్లు వెళ్లినట్టు సమాచారం. దాంతో ఆమెను సబిత గుర్తుపట్టే అవకాశం ఉందని గ్రహించిన మధ్యవర్తులు భాగ్యలతకు బదులు ఆమె భర్తను ఇటీవల మీర్‌పేట్ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి తీసుకెళ్లి సబితారెడ్డి చేతుల మీదుగా చెక్కు ఇప్పించారు. బాలాపూర్ రెవెన్యూ కార్యాలయంలోని కొందరు కిందిస్థాయి సిబ్బంది లంచాలు తీసుకుని పైరవీకారులకు ఆర్థిక సాయం మంజూరు చేయిస్తున్నట్టు తెలిసింది.

విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం

నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు కల్యాణ లక్ష్మి పథకం వర్తించదు. మీర్‌పేట్‌లో ఓ టీచర్ కుమార్తెకు ఆర్థిక సాయం అందినట్టు కొందరు నా దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటాం. ఇందులో తమ సిబ్బంది పాత్ర ఉంటే వారిపైనా చర్యలు తప్పవు.

\- ఇందిరాదేవి, తహసీల్దార్, బాలాపూర్ మండలం



ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన నీటి కొలనును పరిశీలిస్తున్న జీహెచ్‌ఎంసీ డీఈ సన్ని, అధికారులు

ఎన్టీఆర్ స్టేడియంలో రెండు నీటి కొలనుల ఏర్పాటు

కవాడిగూడ, సెప్టెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయడానికి ఎన్టీఆర్ స్టేడియంలో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా నీటి కొలనులను ఏర్పాటు చేశారు. ముషీరాబాద్ సర్కిల్-15 డీఈ సన్నీ సిబ్బందితో కలిసి కొలనులను ఆదివారం పరిశీలించారు. ఒకటి నుంచి నాలుగు ఫీట్లు, నాలుగు నుంచి ఆరు ఫీట్ల విగ్రహాలను నిమజ్జనం చేయడానికి స్టేడియంలో రెండు నీటి కొలనులను ఏర్పాటు చేశామని డీఈ తెలిపారు. ఆదివారం చిన్న చిన్న విగ్రహాలను భక్తులు కుటుంబ సమేతంగా వచ్చి నిమజ్జనం చేశారన్నారు.

మండపాల వద్ద బందోబస్తుకు ప్రత్యేక ఫోర్స్

చిక్కడపల్లి, సెప్టెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన వినాయకమండపాల వద్ద బందోబస్తు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక ఫోర్స్‌ను రప్పించారు. ఆదివారం స్థానిక పోలీసులతోపాటు ప్రత్యేక ఫోర్స్‌కు ఇన్‌స్పెక్టర్ సీతయ్య పలు సూచనలు చేసి, వారికి కేటాయించిన ప్రాంతాలకు పంపించారు.



బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద పూజలు నిర్వహిస్తున్న బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతంరావు, మాజీ మంత్రి సి. కృష్ణాయాదవ్ తదితరులు



ముషీరాబాద్‌లో స్వామి వివేకానంద యూత్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం పూజలు చేసిన బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుషాల్ గౌడ్, బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్‌గౌడ్



అంబర్‌పేటలో గణనాథుడికి పూజలు చేస్తున్న బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సిద్దార్థ ముదిరాజ్ తదితరులు

టీపీసీసీ అధ్యక్షుడికి శుభాకాంక్షల వెల్లువ



మహేష్‌కుమార్‌గౌడ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ ప్రధాన కార్యదర్శి టి. కృష్ణగౌడ్, టీపీసీసీ కార్యదర్శి యాదగిరిగౌడ్ తదితరులు

కవాడిగూడ/చిక్కడపల్లి/రాంనగర్, సెప్టెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్‌ను కాంగ్రెస్ నగర ప్రధాన కార్యదర్శి ఎం. విజయ్‌కుమార్, కార్యదర్శి ముంజాల విజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు వెంకట్ గోవింద్ ఆయనను కలిసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కెన్నడీ రాజు, రాజీవ్‌గాంధీ నగరపాలిక సంఘటన్ గ్రేటర్ హైదరాబాద్ చైర్మన్ గుర్రం శంకర్, గాంధీనగర్ అధ్యక్షుడు అభిషేక్ కెన్నడీ, ఖైరతాబాద్ ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్, టీపీసీసీ కార్యదర్శి యాదగిరిగౌడ్, టీపీసీసీ కల్లుగీత కార్మిక సెల్ చైర్మన్ కేశం నాగరాజు గౌడ్, వైస్ చైర్మన్ శంభుల శ్రీకాంత్‌గౌడ్, కల్లుగీత కార్మిక సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాలరాజ్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎలికట్టె విజయకుమార్‌గౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, టీపీసీసీ సేవాదళ్ మాజీ అధ్యక్షుడు పొన్నాడ సుబ్రహ్మణ్యప్రసాద్, కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ సేవాదళ్ అధ్యక్షుడు కరణం సురేష్ మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.